

VIN...

# ఒక 'మంచి' కోసం




— విమలారామం

ఎన్నో రోజుల తర్వాత మంజుల పెళ్ళిలో కలిశారు వసుంధర, అనసూయ.

చిన్ననాటి ముచ్చట్లన్నీ చెప్పుకున్నారు మళ్ళీ. కాలేజీనాటి కబుర్లన్నీ తలపోసుకున్నారు తిరిగి. తామిద్దరూ మరి కొన్నాళ్ళు కలిసుండాలని.

"....మా కోసమేనా ఐదురోజుల పెళ్ళి చేసుకోవే మంజూ!" అంది అనసూయ.

"ఏదో శాస్త్రం చెప్పినట్టుంది. ఒక్క రోజు పెళ్ళి ఒక్క గంటలోని కుదించాల్సిన కాలమిది! మనం కలిసుండాలని మంజూ వాళ్ళ నాన్నగార్కి టాక్సు వేస్తామా ఏం?" అని నవ్వింది వసుంధర.

"పోనీ, వసూ నీ దగ్గరకి వచ్చి పది రోజు లుంటుంది. ఆ తర్వాత నువ్వెళ్ళి దాన్దగ్గరుండ కూడదటే!" అని మంజుల సలహా చెప్పింది.

"అలాగే! కాని మావారికి నేనంటే కొంచెం ప్రేమెక్కువ....మళ్ళీ ఇంటికి వెడితే రానివ్వరు." అంది అనసూయ నవ్వుతూ.

"సరే, నాతో పాటు వచ్చెయ్!"

"నేనిలా అర్ధంతరంగా రావటం మీవారికి అభ్యంతరం లేదుగా!"

"పోనీ, వచ్చి ఆ అభ్యంతరా లేమిటో చూడు...." అని అనసూయ బుగ్గలో పొడిచింది వసుంధర.

ఇలా అనుకోకుండా వసుంధర ఇంటికి అనసూయ రావటం జరిగింది.

శ్రీనివాస్ అంత సరదా మనిషని ఊహించ లేదేమో అతని మాటలు విని ఎంతో అబ్బుర పడింది అనసూయ. ఇంట్లో ఉన్నంత సేపూ వసుంధరని ఆట పట్టిస్తున్నట్లే కనిపించేవాడు. కనిపించకుండా ఆమెకు ప్రతి పనిలోను సాయం చేస్తూనే ఉండేవాడు. వాళ్ళ దాంపత్యం ఎంత 'లైవ్లీ'గా ఉంది—అనుకుంది అనసూయ. స్నేహితురాలి అదృష్టానికి అంతరాంతరాలలో అసూయ పడకుండా ఉండలేకపోయింది.

ఆమె వాళ్ళింటికి వచ్చిన మూడోనాడు మధ్యాహ్నం—వాళ్ళు వాకిట్లో కబుర్లు చెప్పుకుం టుండగా - ఎవరో పెద్దమనిషి వచ్చాడు.

"ఈ పేకెట్ అయ్యగారు వచ్చాక ఇవ్వం డమ్మా!" అన్నాడు.

"ఏమిటండీ ఇది!" అంది వసుంధర.

అతను ముఖమంతా నవ్వు పులుముకొని, 'అదేనమ్మా! కంచిపట్టు....తమరు ముచ్చట పడుతున్నారంటేను — అహఁ....అయ్యగారు చెపి తేను....మొన్ననే కంచినుంచి వస్తూ తెచ్చాను. మీకు బాగా ఉంటుంది. అయ్యగార్తో చెప్పండి - రేపు సాయంత్రం వస్తానని........" అని వసుం ధర నోరు విప్పేలోగా వెళ్ళిపోయాడు.

వసుంధర జేవురించిన ముఖం చూసి తెల్ల బోయింది అనసూయ.

"ఎవరే అతను?"

"కంట్రాక్టరు నరసింహం అని మనుషుల్ని కొనే మనిషి!"

"మనుషుల్ని కొనటం ఏమిటి? చిత్రంగా మాట్లాడుతున్నావ్!"

వసుంధర తిక్క తిప్పుకొని నవ్వింది. "అలాంటి వాళ్ళ గురించి తెల్సుకొని ప్రయోజనం ఏంలేదు. మనస్సు పాడవుతుందంతే! ఇప్పుడా గొడవ లెందుక్కాని, మన ఫ్రెండ్ గురించి చెప్పు."

"అలాగే కాని ముందా చేతిలో ఉన్న పాకెట్ విప్పి చీరెలా ఉందో చూడకూడదూ!"

"మన కోసం కానప్పుడు చూడ్డం కూడా ఎందుకు? దండుగ."

"ఏమో—నీ కోసం మీ వారు తెప్పిం చుండచ్చుగా! చూస్తే పోయిందేముంది?"

"ఉహుఁ! ఆయన చేత్తో ఆయనిచ్చింది తప్ప మరోటి ముట్టుకోవడం నాకిష్టముండదు. నా కోసం తెచ్చిందయితే మరి కాసేపట్లో ఆయ నెలాగా వస్తారు. అప్పుడే చూద్దాం...."

"అబ్బ, ఎదురుగా చీర ఉందని తెలిశాక కళ్ళతో చూడకుండా ఎలా ఉండాలనిపిస్తుందే నీకు?"

"అది మన కోసమో కాదో తెలియనప్పుడు ఆ మాత్రం నిగ్రహం ఉంచుకోవటం మంచిది."

"ఇంత చాదస్తమేమిటే! కొట్లోకి వెడతాం. కొనుక్కొనే దొరకచే అయినా పదింటి మీద చెయ్యి వేస్తాం. అలాగని విధం చెడ్డామంటావా?

ఇంక స్నేహితురాలితో వాదించటం భావ్యమనిపించలేదు వసుంధరకి. "సరే, చూద్దాం!" అని నవ్వింది. పేకెట్ నలిగిపోకుండా తనే జాగ్రత్తగా విప్పింది. లోపల సుతిమెత్తగా ఒదిగి వున్న చీర మడతను విడదీసింది.

గులాబిరంగు పట్టు చీర – కెంపు రంగు మీద జరీ దిద్దిన వెడల్పాటి అంచు – సుతారంగా అక్కడక్కడ అంటించినట్టున్న జరీ పువ్వులు – కన్నులవిందు చేసుకోకుండా ఉండలేకపోయింది వసుంధర.

"అబ్బ, ఎంత బావుందే! నీ ఒంటికి చక్కగా నప్పుతుంని. ఏదీ, చూడనీ...."

వసుంధర చెయ్యి అడ్డు పెట్టేలోగా చీర మడత విప్పి ఆమె ఒంటిమీద వేసి ఎంతో ముచ్చటపడింది అనసూయ. "ఆ పెద్ద మనిషి నిజం చెప్పాడు సుమా! నీకిది నిజంగా ఎంతో బాగుంది...."

ఏదో అనబోయి చటుక్కున ఆగిపోయింది వసుంధర.

ఆమె ముఖభావాలు గుర్తించని అనసూయ "ఎంతుంటుందంటావ్?" అంది.

"ఏమో! మనది కానప్పుడు ఎంతుంటే మాత్రం మనకెందుకు?" అంది వసుంధర మళ్ళీ పేకెట్ జాగ్రత్తగా కట్టేస్తూ.

"నీ కబుర్లకేంలే! సాయంత్రం శ్రీవారు వచ్చి ఇది నీకే తెప్పించా నీరజాక్షీ అంటే ఎగిరి గంతేసి కట్టుకుంటావ్! అప్పుడు నేను చూడక పోయేనా!"

వసుంధర నవ్వి ఊరుకుంది.

ఆ సాయంత్రం శ్రీనివాస్ వచ్చాక అనసూయ ఎదురుగానే చీర సంగతి చెప్పింది వసుంధర.

అతని ముఖం ఎందుకు ఎర్రబడిందో అర్థం కాలేదు అనసూయకు.

"నేను తెమ్మనలేదు. తనే తెచ్చాడు."

"దీన్నేం చేయమంటారు?"

"నీకేం చేయాలనిపిస్తే అది చెయ్యి. మళ్ళీ అతను వస్తే నేను చేయగలిగిందేం లేదని చెప్పు. తను చెప్పదల్చుకునేదేమన్నా ఉంటే ఆఫీసుకి వచ్చి చెప్పమను."

ఆ తర్వాత ప్రస్తావన మార్చేశాడు శ్రీనివాస్.

ఆ భార్యా భర్తల సంభాషణ ఏమిటో అర్థం కాలేదు అనసూయకు. మర్నాడు మధ్యాహ్నం మళ్ళీ ఆ పెద్దమనిషి వచ్చేవరకు ఆమె సందేహం అలాగే ఉండిపోయింది!

"అమ్మగారూ! చీర ఎలా వుందండి?" అంటూ ఆకర్ణాంతం నోరు తెరచుకొని నవ్వుతూ అడిగాడు నరసింహం.

"బాగుందండి. ఖరీదెంత?" అని అడిగింది వసుంధర.

"అబ్బే. మనలో మనకి ఖరీదు లెందుకండి. తమకు నచ్చింది కదా! అదే నాకు కావల్సింది."

వసుంధర ముఖం మీద నవ్వు మాయలేదు. "చీర నచ్చినా పుచ్చుకొనే పద్ధతి నచ్చాలికదాండి. అందుకనే ధర సంగతడిగాను."

"అబ్బెబ్బే. మరోలా అనుకోకండి. మీ కోసమనే తెచ్చాను. అంతగా అడుగుతున్నారు కనుక చెపుతాను. నాల్గువందలు."

"అయితే, అందాకా ఇదుంచండి. తక్కిన రెండొందలు వారు వచ్చే నెల్లో ఇస్తారు." అంటూ రెండు వంద నోట్లు అతని ముందు పెట్టింది వసుంధర.

అతను నిర్ఘాంతపోయాడు. "అదేంటమ్మగారూ!"

"తెచ్చి పెట్టినందుకు ఏం ఇవ్వలేకపోయినా - కొన్న ధరయినా ఇచ్చేద్దామని. అంతా ఒక్కసారి కాకపోయినా రెండు విడతల్లో తీర్చేద్దామని."

నరసింహం ముఖం వెలవెలాపోయింది. "నేను తెచ్చింది అందుక్కాదమ్మగారూ!"

"ఎందుకు తెచ్చారో నాకు తెల్సులెండి. వారికిలాంటివి నచ్చవు. మరింకెప్పుడూ ఇంత శ్రమ తీసుకోకండి."

మాడిన ముఖం మీద మందహాసం పులుముకుంటూ అన్నాడతను: "పోనీ, తమరు చెప్ప కూడదామ్మా! కొంచెం చూసీ చూడనట్టుంటే...."

వసుంధర ముఖం కందిపోయింది. "అబ్బ, ఆడవాళ్ళంటే ఎంత చులకనండీ మీకు! ఆయన మాట కాదని మీ మాట ఆయన దగ్గరకి చేర వేయటానికి మీరు పెట్టుకున్న కూలి మనిషినను కున్నారా? ఇంకెప్పుడూ పరువు మర్యాదలతో బ్రతుకుతున్న ఆడవాళ్ళని బజారు మనుషులుగా లెక్కవేయకండి. మీ పనులేమయినా ఉంటే ఆయనతో డైరక్టుగా ఆఫీసులోనే చెప్పుకోండి. దయ ఉంచి ఇంకెప్పుడూ ఇలా ఇంటికి వచ్చి ఇరుకున పెట్టకండి...." అంటూ డబ్బు వెనక్కి తీసుకొని చీర పేకెట్టు అతని ముందు పడేసింది వసుంధర!

'ఇంక వెడతారా.... తలుపేసుకుంటాను' అన్నట్టు ఓ అడుగు ముందుకు వేసింది.

అప్పటికే చెట్టంత మనిషి పిట్టలా ముడుచుకుపోయి, నోట మాట రాక నీళ్ళు కారిపోతూ ఆ పేకెట్టు తీసుకొని వెళ్ళిపోయాడు నరసింహం.

వసుంధర వచ్చి వెన్ను తట్టేవరకూ కొయ్య బొమ్మలా అక్కడే నిలబడిపోయింది అనసూయ.

"అదేమిటే అనూ! నువ్వలాగయిపోయావ్!" అంది నవ్వుతూన్న వసుంధర.

"అబ్బ, ఎంత షాక్ తినిపించావే!"

"నీకా, అతనికా?"

"ఇద్దరికీను. మంచి నీళ్ళడగటానికయినా నోరు రాకుండా అదే పోత పోయాడా మనిషి. కొంచెం నాకయినా ఇయ్యి."

"పాపం. అతని మీద నీకెంత జాలి!"

"నువ్వు. నీ శ్రీవారూ మడి కట్టు క్కూర్చున్నంత మాత్రాన జరిగేపనులు ఆగిపోతున్నాయా?"

"కొందరాపని చేస్తున్నారు కదాని మనమూ ఆ పనే చెయ్యాలంటావా?"

"కాదు. ఎందరో అదే పని చేస్తున్నప్పుడు— కొందరే ఇలా ఉండి సాధించేదేముంది?"

"నువ్వా చీర నా ఒంటి మీద పెట్టినందుకే ఇప్పటికీ నాకు కంపర మెత్తినట్లుగా ఉంది. ఇంక కట్టుకుని భరించగలనా? అదేం లేదని ఆత్మవంచన చేసుకుంటే—ఎలాంటి పనులయినా చేయవచ్చు. కాని, నాకంత ధైర్యం లేదు.... నాకు వద్దు కూడా!"

"నిన్నెవ్వరూ మెచ్చుకొని మెడలో హారాలు వేయరు" అంది అనసూయ పరిహాసంగా.

"ఎవరో మెచ్చుకోవాలని మనమీ పని చేయటం లేదు! మనకది 'మంచి' అని తోచింది కనుక చేస్తున్నాం. అదే మనకు తృప్తి. తృప్తిని మించిన సుఖం మరోటేముంది?"

" అది పైకి చెప్పుకొనే మాట. కాని సరిపెట్టు కోవటం—సమాధాన పడడం నిజంగా జరిగేది."

" నువ్వేం పేరు పెట్టినా నా కొక్కటే! ఆయన ఆత్మాభిమానాలమ్ముకొని అవినీతికి లొంగిపోయి బనారస్ సిల్కులు, బంగారు గాజులు తెచ్చి అందిస్తే అది నాకానందం కాదు. ఆయన కష్టపడి సంపాదించిన దాంట్లో సాదా వాయిలు చీరయినా నాకు మహద్భాగ్యమే! డైనింగ్ టేబిలు దగ్గర కూర్చుని వంటావిడ చేసిపెట్టిన జీడిపప్పు పాయసమో—రసగుల్లాయో తినలేక పోవచ్చు. నా చేత్తో నేను చేసిన బియ్యపు పరమాన్నమే—ఆయనకు తినిపిస్తూ నేను తింటుంటే ఎక్కడలేని సంతోషమూ నా గుండెల్లో నిండుతుంది. అసలన్ని దరిద్రాల్లోను మొదటిది అసంతృప్తి. ఉన్నవాళ్ళతో మన స్థితిని పోల్చుకున్నప్పుడే మనకన్ని బాధలూ ఎదురవుతాయి. ఎంత ఉన్నా ఇంకా ఏదో ఒకటి కావాలనిపిస్తూనే ఉంటుంది. దానికో పరిమితి అంటూలేదు. అవధంటూ ఉండదు. అదే లేని వాళ్ళను ఒక్కసారి పరికించి చూస్తే—మన పరిస్థితి ఎంతో మెరుగనిపిస్తుంది—మనకప్పుడే తృప్తి ఇచ్చే సుఖం తెల్సివస్తుంది. అదెక్కడోలేదు — మన చేతుల్లోనే ఉంది. మన మనస్సుల్లోనే ఉంది!"

అనసూయ కిక మాటలు దొరకలేదు! స్నేహితురాలి వైపు వింతగా చూస్తూండి పోయింది.

*

మరో రెండు రోజులు సరదాగా గడిచి పోయాయి.

"అబ్బో, అప్పుడే నేనొచ్చి వారం అయింది. ఇంక వెళ్ళిపోతానే!" అంది అనసూయ.

"ఏమంత తొందర? తిన్నగా వెళ్ళేది పుట్టింటికేగా! మరో రెండు రోజులుండి అన్నీ చూసి వెళ్ళు. ఊళ్ళో ఎగ్జిబిషన్ పెట్టారు కూడా!" అంది వసుంధర.

వాళ్ళు ఆ కబుర్లలో ఉండగానే ఇంటి ముందో జీపు ఆగింది. అది దిగి వస్తున్న ఆవిడను చూసి నిర్ఘాంతపోయింది అనసూయ! ఆమె ఆశ్చర్య పోయింది—ఆవిడ అందం మిరిమిట్లు గొలిపిందని కాదు. ఆమె తెల్లబోయింది — ఆవిడ ముట్టుకుంటే మాసిపోయేంత నాజూగ్గా ఉందని కాదు. ఆమె అబ్బురపడింది — ఆవిడ అతి చక్కగా అలంకరించుకుందనీ కాదు. ఆమె చిత్తరువై పోయింది — ఆవిడ ఒంటి మీద తళతళలాడుతున్న గులాబి రంగు పట్టు చీరను చూసి! ఆమె కనురెప్ప వేయలేకపోయింది — ఆవిడ పమిట అంచు మీద జరీ అద్దిన కెంపు రంగు చూసి చీర నిండా అతి చక్కగా మెరుస్తున్న జరీ పూలనీ చూసి!

రెన్నాళ్ళ క్రితం వసుంధర ఒంటి మీద తన చేతుల మధ్య—ముచ్చటగా మెత్తగా మసిలింది—అచ్చం అటువంటి చీరే!

" మా అమ్మాయి పుట్టిన రోజీవేళ! మీరు తప్పకుండా రావాలి వసుంధరా!"

ఆవిడ గొంతు విని వాస్తవంలోకి వచ్చింది అనసూయ. తన కూ్కడా బొట్టు పెడుతున్న ఆవిడను చూశాక నోట్లో మాట దాచుకోలేక పోయింది. "....ఈ చీర చాలా బాగుందండి! ఎక్కడ కొన్నారు?"


ఆవిడ టక్కున జవాబిచ్చింది. " మా వారా మధ్య మద్రాసెళ్ళారైండి. వస్తూ పట్టుకు వచ్చారు. వారికిలాంటి చీరలంటే మహ యిష్టం!"

" ఓహో! సెలక్షను చాలా బాగుందండి! ఖరీదెంత?"


" అబ్బే, ఎంతోనా? ఆరువందల పాతిక...." అతిశయంగా ఒకసారి తన చీర వైపు—వాళ్ళ వైపు మార్చి మార్చి చూసి ఆవిడ హైహీల్డు షూ టక టకలాడించుకుంటూ వెళ్ళిపోయింది!

"....ఎవరావిడ?" అంది అనసూయ కుతూహలంగా.


" ఇంకా గుర్తుపట్టలే!....మావారి పై ఆఫీసరు భార్య!" అంది వసుంధర.... *




* సాధారణంగా వాడుకలో ఫ్లాస్క్ లోపల మరకలు ఏర్పడి అవి ఎలా కడిగినా పోకుండా అలాగే నిల్చివుంటాయి. అటువంటప్పుడు కోడిగుడ్డు సొనను బాగా చిలక్కొట్టి అందులో కొంత భాగాన్ని నీటితో కలిపి ఫ్లాస్క్‌లో పొయ్యాలి. ఆ తరువాత ఫ్లాస్క్ మూత బిగించి బాగా షేక్ చెయ్యాలి. ఇలా ఒకటి రెండుసార్లు చేస్తే ఫ్లాస్క్ లోపలి భాగం శుభ్రమవటమే కాక కాంతివంతంగా కూడా వుంటుంది.




* ఫర్నిచర్ మీది మరకలు తొలగించాలంటే ముందు స్పిరిట్‌ను మరకలున్నచోట బాగుగా రాసి తరువాత పొడి గుడ్డతో తుడిస్తే మరకలు పోవడమే కాకుండా ఫర్నిచర్ కూడా కొత్తదానిలా మెరుస్తుంది.



* పచ్చి మిరపకాయలు ఎక్కువకాలం నిల్వ వుండాలంటే ముచ్చికలు తీసివేయండి.



* బిస్కెట్ల డబ్బాలో బ్లాటింగ్ పేపరు వుంచితే, బిస్కెట్లు కరకరలాడుతూ తాజాగా వుంటాయి.



* ఇంట్లో స్పేర్‌గా వున్న సూదులు, మేకులు, స్క్రూలు బూట్ పాలిష్ ఖాళీ టిన్స్‌లో వేసి వుంచినట్లయితే తుప్పు పట్టవు.

పంపినవారు : అంగర శ్రీదేవి.